సాక్షి
విశాఖపట్నం

బుధవారం ׀ 26 ׀ జూలై ׀ 2023



హమ్మయ్య.. లోటు తీరింది!

జిల్లాలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు లోటు వర్షపాతం స్థాయి నుంచి సాధారణానికి తీసుకొచ్చాయి. 8లో



ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి

నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 8లో



స్పెషల్ రైళ్ల పొడిగింపు

ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో నడుస్తున్న పలు వీక్లీ స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగించారు. 10లో

న్యూస్‌రీల్

వేగవంతంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు



కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో జగనన్న లే అవుట్ల ఇళ్ల నిర్మాణంపై వెబెక్స్ ద్వారా ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, జీవీఎంసీ, అన్ని మండలాల ఎంపీడీవోలు, కాంట్రాక్టర్లతో ఆయన సమీక్షించారు. జగనన్న లే అవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న గృహాలన్నీ బేస్మెంట్ స్థాయికి, బేస్మెంట్ లెవెల్ అంతకన్నా ఎక్కువ స్థాయిలో ఉన్న గృహాలను రూఫ్ క్యాస్టింగ్ స్థాయికి తీసుకురావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే స్టేజీ అప్డేషన్ తోపాటు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్ లే అవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా జరిగేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, గృహ నిర్మాణ సంస్థ పీడీ శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ అధికారులు, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

ఈస్టర్న్ రైల్వేస్‌కు వాల్తేర్ పూర్వ డీఆర్‌ఎం



అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పూర్వ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి ఈస్టర్న్ రైల్వేస్, కోల్‌కతాకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనతో పాటు పలువురు డీఆర్‌ఎంలను బదిలీ చేశారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా వెంకటరమణ



మురళీనగర్: నగరంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్‌క్రాఫ్ట్ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఎస్.రవి సెలవుపై వెళ్తున్నందున.. ఆయన స్థానంలో డాక్టర్ వెంకటరమణను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇలా ఆయన్ని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమించడం ఇది రెండోసారి. గతంలో ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా రమణ పనిచేసిన కాలంలో ఇన్‌స్టిట్యూట్ స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల్లో ఫుడ్ క్రాఫ్టింగ్‌పై ఆసక్తి, ప్రేరణ కలిగించేందుకు సెమినార్లు ఏర్పాటు చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

మహారాణిపేట: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థులకు ర్యాగింగ్ యాక్ట్ 1997పై ప్రత్యేక అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులకు జైలు శిక్ష, జరిమానా ఉంటాయన్నారు. అందువల్ల ర్యాగింగ్ జోలికి వెళ్లి బంగారు భవిష్యత్ పాడు చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర కిశోర్, డాక్టర్ టి.సురేఖ, డాక్టర్ ఎం.హేమరాధిక, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే నెల 1న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ రాక

ఏయూక్యాంపస్: నగరానికి డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనోజ్ కుమార్ సాహు రానున్నారు. ఢిల్లీ నుంచి వచ్చే నెల 1న సాయంత్రం 5.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 2,3 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సదస్సు జరుగుతుంది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొంటారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఈ సదస్సులో దిశానిర్దేశం చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు.

అభివృద్ధిపైనే ఫోకస్



మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, చిత్రంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ, కార్పొరేటర్లు

- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం
- 44 అంశాలు, 41 సప్లిమెంటరీ, 7 టేబుల్ అజెండా అంశాలకు ఆమోదం

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. విపక్షాల ప్రశ్నలకు అధికార పక్షం దీటుగా సమాధానాలిచ్చింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ముందుగా జీరో అవర్‌లో సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. కౌన్సిల్ సమావేశంలో మొత్తంగా 44 అంశాలు, 41 సప్లిమెంటరీ అంశాలతో పాటు 7 టేబుల్ ఎజెండా అంశాలపై చర్చ సాగింది. విశాఖ నగర అభివృద్ధి, మెరుగైన పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నివారణ, పర్యావరణ సమతుల్యత, ఎకో–వైజాగ్‌లో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఎకో–ఫండ్, సొసైటీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. 8 జోన్లలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మరికొన్ని పరిపాలనా అంశాలపై చర్చ సాగింది. ఇటీవల ఎన్నికైన స్థాయీ సంఘ సభ్యులను ముందుగా కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు.

కౌన్సిల్ జరిగిందిలా..

ఉదయం 11 గంటలకు మేయర్, కౌన్సిల్ చైర్‌పర్సన్ గొలగాని హరివెంకటకుమారి బెల్ మోగించి సభ ప్రారంభించారు. గత కౌన్సిల్ సమావేశంలో మాదిరిగానే జీరో అవర్ కేటాయించాలని మేయర్‌ను కార్పొరేటర్లంతా కోరారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన జీరో అవర్ మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగింది. 98 మంది సభ్యుల్లో 50 శాతం మంది తమ సమస్యలు విన్నవించుకున్నారు. లంచ్ తర్వాత 44 అంశాలు, 41 సప్లిమెంటరీ అంశాలతో పాటు 7 టేబుల్ ఎజెండా అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు.

మురికివాడల అభివృద్ధిపై దృష్టి సారించండి

జీవీఎంసీ పరిధిలో మురికివాడల అభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఈ అంశంపై ప్రతి నెలా సమావేశం నిర్వహించాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల బానిసలకు పోలీసులు శిక్ష అమలు చేస్తున్నా.. వారిలో మార్పు రావడం లేదన్నారు. అలాంటి వారి కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో పునరావాస, కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జీవీఎంసీ 6వ వార్డు పరిధిలో చంద్రంపాలెం స్కూల్ వద్ద ఫ్లై/ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో నాలుగు వేల మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వార్డు కార్పొరేటర్ ప్రియాంక తెలిపారు. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సాయికాంత్ వర్మను ఆదేశించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో 21వ వార్డులో మీతో మీ కార్పొరేటర్ కార్యక్రమం నిర్వహించి.. పలు సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇప్పటికీ అవి పరిష్కారం కాలేదన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు. మర్రిపాలెం స్టేషన్‌లో రైల్వే ప్లాట్‌ఫాం విస్తరించిన నేపథ్యంలో జీవీఎంసీ చేపట్టాల్సిన పనులు చాలానే ఉన్నాయన్నారు.



విపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ శంకరరావు

టీడీపీ సభ్యుల సస్పెన్షన్.. ఎత్తివేత

బీచ్‌రోడ్డులో నాలుగు కిలోమీటర్లకు రూ.2 కోట్లతో డివైడర్ చుట్టూ ఫెన్సింగ్ ఖర్చుపై టీడీపీ కార్పొరేటర్లు వివరణ కోరగా అధికార పార్టీ కార్పొరేటర్లు సమాధానమిచ్చారు. దీనికి టీడీపీ కార్పొరేటర్లు సంతృప్తి చెందకపోగా.. ఆందోళన చేసి సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మేయర్ ఆగ్రహించారు. సభా సంప్రదాయాలను పాటించకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అయినా వారు వినకపోవడంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సహా 8 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్లకార్డులతో మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. వీరికి తోడుగా జనసేన, వామపక్ష, బీజేపీ సభ్యులు జత కలిశారు. దీంతో మేయర్ సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం మేయర్ టీడీపీ సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 44 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం టేబుల్ అజెండాలోని అంశాలను మేయర్ చదివి వినిపించారు.



పోడియం దగ్గర ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు

ప్రధాన చర్చ వీటిపైనే..

- 8 జోన్లలో అభివృద్ధిపై విస్తృత చర్చ
- 10 వేలకు పైగా వీధిలైట్లు వెలగలేదని నివేదిక.. టాస్క్‌ఫోర్స్ కమిటీ వేస్తున్నట్టు కమిషనర్ ప్రకటన
- సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న చర్యలు
- పర్యావరణ సమతుల్యత, బీచ్ క్లీనింగ్, ఎకో–ఫండ్, ఎకో–వైజాగ్
- వేసవి శిక్షణ శిబిరాల్లో అవినీతిపై నిగ్గు తేల్చాలని కార్పొరేటర్ల పట్టు.. విచారణకు మేయర్ ఆదేశం
- సిటీలో రెండు సీ ఫుడ్ కోర్టుల ఏర్పాటు.. నైట్ ఫుడ్‌కోర్టు ఎత్తివేత
- బీచ్‌రోడ్డులో డివైడర్ చుట్టూ ఫెన్సింగ్

వీధి లైట్ల సమస్యకు పరిష్కారం



వీధిలైట్ల అంశంపై వివరణ ఇస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

జీరో అవర్‌లో అధికార పక్షం, విపక్ష కార్పొరేటర్లలో సగం మందికి పైగా తమ వార్డు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మెజార్టీ కార్పొరేటర్లు తమ వార్డుల్లో వీధి లైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై మేయర్.. కమిషనర్‌ను వివరణ కోరారు. జీవీఎంసీ పరిధిలో 1.18 లక్షల వీధి దీపాలు ఉన్నాయని.. ఇందులో 10, 620 లైట్లు వెలగడం లేదని తమ దృష్టికి వచ్చిందని కమిషనర్ తెలిపారు. వీటి పర్యవేక్షణ కోసం అదనంగా 130 మందిని నియమించినట్లు తెలిపారు. ఎక్కడెక్కడ లైట్లు వెలుగుతున్నాయో అప్‌లోడ్ చేసే విధంగా కొత్త యాప్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. సచివాలయ ఎమినిటీ కార్యదర్శులతో ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తామని.. ఈ నెలాఖరులోపు పూర్తిస్థాయిలో ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అన్ కవర్డ్ ప్రాంతాల్లో కూడా అదనంగా వీధి దీపాలు వేస్తామని కమిషనర్ వెల్లడించారు.

అదనపు కమిషనర్ నిలదీత

వేసవి శిక్షణ శిబిరాల్లో భారీగా అవినీతి జరిగిందని అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు అదనపు కమిషనర్ శ్రీనివాసరావును నిలదీశారు. దీనికి ఆయన పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో మేయర్ విచారణకు ఆదేశించారు. అవినీతి జరిగిందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేటర్ సాధిక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలున్న చోట్ల ఎక్కువగా ప్రజా రోడ్లు ఉపయోగిస్తుంటారని.. గతంలో వారు 50:50 శాతం నిష్పత్తి నిధులతో రోడ్లు, మౌలిక వసతి సదుపాయాలు కల్పించేవారని తెలిపారు. ఇప్పుడు అలా జరగడం లేదని.. వారు వీలైనంత మేరకు ఎక్కువ నిష్పత్తిలో నిధులు కేటాయించి రోడ్లు వేయించేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని సూచించారు. చిన్నపాటి సమస్యను కూడా పెద్దగా చిత్రీకరించి.. వైజాగ్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. జగదాంబ జంక్షన్ నుంచి క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపిన కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఓల్డ్ కరాస, న్యూ కరాస వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో వాల్ నిర్మిస్తే.. సింధియా వైపు నీరు వెళ్తుందన్నారు. రైల్వే శాఖ అనుమతి తీసుకుని పనులు చేపట్టాలని కోరారు. సాకేత్‌పురం సమీపంలో ట్రాఫిక్ సమస్య ఉందని, చర్యలు తీసుకోవాలన్నారు.

ఒకరు రోడ్డు వేస్తే.. మరొకరు తవ్వేస్తున్నారు

డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు మాట్లాడుతూ నీటి సరఫరా, సివిల్ వర్క్, అండర్ గ్రౌండ్ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో జీవీఎంసీ నిధులు వృథా అవుతున్నాయన్నారు. ఒకరు రోడ్డు వేస్తే.. మరొకరు తవ్వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బానాల శ్రీనివాసరావు తమ వార్డు సమస్యలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ పరిధిలో విద్యార్థులకు సాంకేతిక లోపాల కారణంగా అమ్మ ఒడి పథకం మంజూరు కాలేదని కార్పొరేటర్ జి.గంగారావు తెలిపారు. దీనిపై డిప్యూటీ మేయర్ సతీష్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి పథకం అందిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తన వార్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ కొణతాల నీలిమ మాట్లాడుతూ తాడి గ్రామాన్ని వేరే చోటకు తరలిస్తున్నందున.. అక్కడ సౌకర్యాలు కల్పించాలన్నారు. జోన్‌లో మలేరియా సిబ్బందిని నియమించాలని కోరారు. కార్పొరేటర్ అక్కరమాని పద్మ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల సమీపంలో కళ్లు పాకలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆమోదించిన అంశాల్లో కొన్ని..

- రూ.12.5 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, కాలువల నిర్మాణానికి ఆమోదం
- హనుమంతవాక జంక్షన్ నుంచి కైలాసగిరి సర్కిల్ వరకు రూ.3.9 కోట్లతో ఫుట్‌పాత్ నిర్మాణం
- సిటీ బ్యూటిఫికేషన్, పార్క్ హోటల్, సాగర్ నగర్ బీచ్‌రోడ్ సమీపంలో రెండు సీ ఫుడ్ స్ట్రీట్ కోర్టుల ఏర్పాటుకు ఆమోదం
- మెప్మా ఆధ్వర్యంలో పనిచేసే కమ్యూనిటీ ఆర్గనైజర్లకు అదనంగా మరో 38 మందిని కొత్తగా నియమించేందుకు ఆమోదం
- బీచ్ క్లీనింగ్ కోసం రూ.1.82 కోట్ల పనులకు ఆమోదం
- అనకాపల్లిలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.93 కోట్లు, సెంట్రల్ మీడియన్‌కు రూ.64 లక్షలు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.85 లక్షలు, ఫుట్‌పాత్, రోడ్డు విస్తరణకు రూ.1.4 కోట్లు కేటాయిస్తూ ఆమోదం
- రూ.2.8 కోట్లతో అనకాపల్లి పెరుగు బజార్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు డ్రైనేజీ ఏర్పాటుకు ఆమోదం
- జైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టు ఎత్తివేసేందుకు ఆమోదం..

దంచికొట్టిన వాన

- మధురవాడలో 9.2 సెం.మీల వర్షపాతం
- నేడు, రేపు కొనసాగనున్న వర్షం



సాగరతీరంలో జలమయమైన రోడ్లు





ప్రాంతం	వర్షపాతం (సెం.మీలలో)		
మధురవాడ జాతర	9.2	గంభీరం	6.5
కాపులుప్పాడ	8.2	గాజువాక శ్రీనగర్	6.5
ఎండాడ	7.1	పరదేశిపాలెం	6.0
జూపార్కు	6.5	సీతమ్మధార	5.5
		పెందుర్తి	5.5
		గంగవరం	5.4

సాక్షి, విశాఖపట్నం: విశాఖను వర్షాలు వదలడం లేదు. వరసగా మూడో రోజూ ఉధృతి తగ్గలేదు. మంగళవారం కూడా నగరంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. ఉదయం తేలికపాటి జల్లులు పడ్డాయి. సాయంత్రానికి మరింత ఉధృతమై భారీ వాన కురిసింది. రాత్రి కూడా అలా కురుస్తూనే ఉంది. దీంతో ఎప్పటిలానే నగరంలోని రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం జన జీవనానికి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించింది. గరిష్టంగా మధురవాడ జాతర వద్ద 9.2 సెం.మీల వర్షపాతం రికార్డయింది. ఇంకా పలుచోట్ల 4–8 సెం.మీల వర్షం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై ఎక్కువగా ఉండనుంది. ఫలితంగా విశాఖలో బుధ, గురువారాల్లోనూ వర్షాలు కొనసాగనున్నాయి. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 45–55, గరిష్టంగా 65 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉన్నందున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.

రేడియో ఐసోటోప్స్‌పై ఏయూలో జాతీయ సదస్సు

సెప్టెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అణు భౌతిక శాస్త్ర విభాగం, నేషనల్ అసోసియేషన్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ ఇన్ ఇండస్ట్రీ(నారీ–ముంబయి) సంయుక్తంగా సెప్టెంబర్ 28, 29 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాయి. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఈ వివరాలు వెల్లడించారు. 'రీసెంట్ ట్రెండ్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్–రేడియేషన్ టెక్నాలజీస్' అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ఈ రంగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ.. పరిశ్రమలు స్థాపన జరిపే దిశగా సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నారి జనరల్ సెక్రటరీ పి.జె చాంది మాట్లాడుతూ రేడియో ఐసోటోప్స్ రంగంలో జరుగుతున్న పరిశోధనలు, ఉత్పత్తి చేసే విధానం, వినియోగం, భద్రత తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు, చర్చలు ఉంటాయన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా ఈ అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అణుభౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

28న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. లలితా జ్యువెలరీ మార్ట్, కల్యాణ్ జ్యువెలర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, స్పందన స్ఫూర్తి, ఫైనాన్షియల్, హానర్ ల్యాబ్స్, హెటిరో డ్రగ్స్, యాక్సిస్ బ్యాంక్, టీమ్ లీజ్ తదితర ప్రైవేట్ కంపెనీల్లో 415 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. జ్యువెల్లరీ మార్కెటింగ్, అసోసియేట్ ఏజెంట్, బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటివ్స్, రిలేషన్ షిప్, ప్రోసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజినీర్, కార్పెంటర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజినీర్ క్యాడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గొడౌన్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్ తదితర ఉద్యోగాలకు ఇంటర్, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18–39 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ

పీఎం పాలెం : యువత మత్తు పదార్థాలకు బానిసైతే అమూల్యమైన జీవితం నాశనమవుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్‌లో గాయిత్రీ విద్యాపరిషత్ విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వీటిని వినియోగించినా, కలిగి ఉన్నా, సరఫరా చేసినా ఎన్‌డీపీఎస్ చట్టం ద్వారా కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలపై సమాచారాన్ని 14500 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 2500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డీసీపీ–1 విద్యాసాగర్‌నాయుడు, ఏయూ సైకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.వి.ఆర్.రాజు, ఇంటర్నేషనల్ సర్టిఫైడ్ ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ ఉమారాజ్, చైర్మన్ సురేష్ బేతా పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఎంపీహెచ్‌ఏల తొలగింపునకు రంగం సిద్ధం

మహారాణిపేట: హైకోర్టు ఆదేశాలతో వైద్య ఆరోగ్యశాఖలో 35 మంది మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(ఎంపీహెచ్‌ఏ) తొలగింపునకు రంగం సిద్ధమైంది. ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఇటీవల వారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై ఆరుగురు ఎంపీహెచ్‌ఏలు సోమ వారం జరిగిన జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేశారు.

2003లో అప్పటి జిల్లా యంత్రాంగం ఎంపీహెచ్‌ఏల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంపీహెచ్‌ఏలకు సాంకేతిక పరీక్షలతో పాటు కనీస అర్హతగా 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మెరిట్‌తో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని అందులో స్పష్టం చేశారు. ఈ ప్రకారం 148 మందిని ఎంపిక చేశారు. అయితే నిబంధనల ప్రకారం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతోపాటు ఇతర సాంకేతిక పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఎంపీహెచ్‌వోలుగా అర్హులు. కానీ 10వ తరగతి ఉత్తీర్ణతతో ఎంపిక చేయడంతో కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో చాలా మంది నకిలీ సర్టిఫికెట్లతో అక్రమంగా ఉద్యోగాలు పొందారని పిటిషనర్ ఆరోపించారు.

కోర్టు ఆదేశాలతో అప్పట్లో చాలా మందిని విధులను తొలగించారు. మిగిలిన 42 మందిలో కొంత మంది అప్పట్లో కోర్టును ఆశ్రయించారు. వీరిని కొనసాగించమని కోర్టు ఆదేశాలు ఇచ్చిందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. కాలానుక్రమంలో వీరిలో ఏడుగురు చనిపోవడం, ఉద్యోగం మానేయడం జరిగింది. చివరికి 35 మంది విధుల్లో మిగిలారు. అయితే ఉద్యోగం నుంచి తొలగించిన వారు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. దీంతో మొత్తం అందరినీ తొలగించి, విధి విధానాలు రూపొందించి, కొత్తగా నియామకం చేపట్టాలని కోర్టు తాజాగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో వారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. విధుల నుంచి ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. దీనిపై ఆరుగురు ఎంపీహెచ్‌ఏలు సోమవారం జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. కలెక్టర్ మల్లికార్జున దృష్టికి ఎంపీహెచ్‌ఏల వ్యవహారాన్ని తీసుకెళ్లినట్లు చెప్పారు. 35 మంది ఎంపీహెచ్‌ఏలను నోటీసులు జారీ చేశామని, వారి నుంచి ఇంకా వివరణ రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్లీడర్ సూచనలతో కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేస్తున్నట్లు వెల్లడించారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
MEDICAL AND HEALTH DEPARTMENT

Tender Notification Rc.No.291/S1/2023-2024 Dt.25.07.2023.

TENDER NOTICE FOR RUNNING OF CANTEEN ON LEASE BASIS FOR A PERIOD OF TWO YEARS

Sealed tenders are invited from the Contractors / Proprietors for running of Hospital Canteen on Lease basis for a period of two years at Government Victoria Hospital for Women and Children, Visakhapatnam. The Tender Schedule with specifications and Terms and Conditions will be issued separately for purchase of items on payment of **Rs.5,000/-** for each Tender Schedule through D.D. from any Nationalized Bank in favour of the Superintendent, Government Victoria Hospital for Women and Children, Visakhapatnam and available in this office (S1) from **27-07-2023 to 05-08-2023** on any working day from **11.00 AM to 4.00 PM.**

Sd/- Dr.P.USHA, SUPERINTENDENT

GOVERNMENT OF ANDHRA PRADESH
MEDICAL AND HEALTH DEPARTMENT

OFFICE OF THE SUPERINTENDENT, GOVERNMENT VICTORIA HOSPITAL FOR WOMEN AND CHILDREN, VISAKHAPATNAM.

Tender Notification Rc.No.290/S1/2023-2024 Dt.25.07.2023

TENDER NOTICE FOR SUPPLY OF MEDICAL OXYGEN CYLINDERS FOR A PERIOD OF TWO YEARS

Sealed tenders are invited from the reputed Suppliers/ Distributors, Visakhapatnam local for supply of **MEDICAL OXYGEN CYLINDERS** to this hospital. The Tender Schedule with specifications and Terms and Conditions will be issued separately for purchase of items on payment of **Rs.5,000/-** for each Tender Schedule through D.D. from any Nationalized Bank in favour of the Superintendent, Government Victoria Hospital for Women and Children, Visakhapatnam and available in this office (S1) from **27-07.2023 to 05-08-2023** on any working day from **11.00 AM to 4.00 PM.**

Sd/- Dr.P.USHA, SUPERINTENDENT



ఆనందపురం మండలం బోనిలో నాట్లకు సిద్ధమైన వరినారు

హమ్మయ్య.. లోటు తీరింది!

- విశాఖ జిల్లాలో సాధారణ స్థాయికి వర్షపాతం
- తొమ్మిది మండలాల్లో మెరుగు
- పెదగంట్యాడ, ములగాడ మండలాల్లోనే లోటు
- వానలతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజను ఆలస్యంగా ఆరంభమైంది. అంతేకాదు.. ఆ తర్వాత కూడా అరకొర వర్షాలనే కురిపిస్తోంది. జూన్, జులై నెలల్లో అంతంతమాత్రంగా కురిసిన వానలతో విశాఖ జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పాటు పొరుగు జిల్లాల్లో కంటే విశాఖ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. దీంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. ఇప్పటికే చాలీచాలని వర్షాలతో ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. ఎప్పుడైనా మోస్తరు వర్షం కురిస్తే వెంటనే సాగుకు సన్నద్ధమవడం, ఆ మార్నాడు మళ్లీ వాన కనుమరుగైతే మళ్లీ ఉసూరుమనడం రైతులకు అలవాటుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాలో సమృద్ధిగా వర్షాలు ఎప్పుడు కురుస్తాయా? అని రైతన్నలు ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వానలు వీరిలో ఆశలు చిగురింపజేస్తున్నాయి. అంతేకాదు.. ఇన్నాళ్లూ ఉన్న లోటు వర్షపాతం స్థాయి నుంచి ఒక్కసారిగా సాధారణానికి తీసుకొచ్చాయి. రెండ్రోజుల క్రితం వరకు జిల్లాలో సాధారణంకంటే -24 శాతం లోటు ఉంది. ఇప్పుడది +2.7 శాతానికి చేరుకుని సాధారణ వర్షపాతానికి చేరుకుంది. విశాఖ జిల్లాలోని 11 మండలాల్లో పెందుర్తి, పద్మనాభం, విశాఖపట్నం రూరల్ మండలాల్లో అధిక వర్షపాతం, ఆనందపురం, భీమిలి, సీతమ్మధార, గాజువాక, మహారాణిపేట, గోపాలపట్నంలలో సాధారణ వర్షపాతం నమోదు కాగా కేవలం పెదగంట్యాడ, ములగాడ మండలాల్లో మాత్రమే లోటు వర్షపాతం రికార్డయింది.

నారుమళ్లు, మెట్ట పంటలకు మేలు

మూడ్రోజుల నుంచి జిల్లాలో 8-10 సెం.మీల వర్షం కురుస్తోంది. ఫలితంగా చెరువుల్లో నీరు చేరుతోంది. ఇప్పటికే కొన్నాళ్ల క్రితం కురిసిన వర్షాలకు వేసిన నారుమళ్లు ఇప్పుడిప్పుడే తయారవుతున్నాయి. తయారైన వరి ఆకును దమ్ము పట్టి నాట్లు వేయడానికి కొంతమంది రైతులు సిద్ధమవుతున్నారు. ఇన్నాళ్లూ వానలపై అనుమానంతో ఉన్న అన్నదాతలు ఇప్పుడు ఖరీఫ్ పనులను ముమ్మరం చేస్తున్నారు. ఈ వానలు వరి నారు మళ్లతో పాటు రాగులు, సజ్జలు, మొక్కజొన్న, వేరుశనగ, కంది తదితర మెట్టు పంటలకు, కూరగాయల పంటలకు మేలు చేస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎ.అప్పలస్వామి 'సాక్షి'కి చెప్పారు. మరింతగా వర్షాలు కురిస్తే చెరువులు నిండుతాయని తెలిపారు.

జూన్ 1 నుంచి ఇప్పటివరకు వర్షపాతం (మి.మీలలో) వ్యత్యాసం (శాతంలో)..

మండలం	సాధారణం	కురిసింది	వ్యత్యాసం	స్థితి
పెందుర్తి	274.1	208	+31.6	అధికం
ఆనందపురం	233.3	207	+12.3	సాధారణం
పద్మనాభం	379.7	284	+33.7	అధికం
భీమునిపట్నం	201.0	216.3	-7.1	సాధారణం
విశాఖ రూరల్	278.2	204.3	+36.2	అధికం
సీతమ్మధార	241.3	216.0	+11.7	సాధారణం
పెదగంట్యాడ	92.6	219.9	-57.9	లోటు
గాజువాక	158.6	175.9	-9.8	సాధారణం
మహారాణిపేట	229.7	216.0	+6.3	సాధారణం
గోపాలపట్నం	228.7	208.3	+9.8	సాధారణం
ములగాడ	123.3	219.9	-43.9	లోటు
మొత్తం	221.9	216.1	+2.7	సాధారణం

27 నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.చంద్రశేఖర్

అల్లిపురం/బీచ్‌రోడ్డు: విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 27వ తేదీ నుంచి దఫదఫాలుగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన 12 డిమాండ్లతో సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్, రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా పలుమార్లు తమ డిమాండ్లను మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదన్నారు. ఆందోళనల్లో భాగంగా ఈ నెల 27, 28 తేదీల్లో నల్లబాడ్జీలు ధరించి లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్స్ చేపట్టనున్నట్లు చెప్పారు. 31వ తేదీన స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు వినతి పత్రాలు అందజేయడం, ఆగస్టు 1వ తేదీన సర్కిల్ ఆఫీస్, హెడ్ క్వార్టర్స్, జోనల్ ఆఫీస్‌లు, జెన్‌కో స్టేషన్ల వద్ద మాస్ ర్యాలీలు ఉంటాయన్నారు. 2, 3 తేదీల్లో రిలే హంగర్ స్ట్రైక్, 4,5,7 తేదీలలో వర్క్ టు రూల్, 8వ తేదీన విజయవాడ, విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా, 9వ తేదీన డిపార్టమెంట్ సిమ్ కార్డులు అప్పగించడం, అప్పటికీ సమస్య పరిష్కరించని యెడల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సాయంత్రం రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో ఏపీఈపీడీసీపీఎల్ యూనిట్, ఏపీ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ పి.ప్రతాప్‌రెడ్డి, కన్వీనర్ బి.సాయికృష్ణ, డిస్కమ్ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి, డిస్కమ్ కన్వీనర్ బి.నాగేశ్వరరావు, ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ మహేశ్వరరెడ్డి, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ట్రాఫిక్ రద్దీపై ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్‌తో చర్చిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ ఇబ్బందులు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం సిరిపురం దత్ ఐలాండ్, తెలుగుతల్లి సబ్‌వే, మద్దిలపాలెం కూడలి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ డీసీపీ జి.శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సిరిపురం దత్ ఐలాండ్ వద్ద ప్రతి రోజు సాయంత్రం, వారాంతపు సెలవు రోజుల్లో ట్రాఫిక్ నియంత్రణ ఇబ్బందిగా ఉన్నందున ద్రోణంరాజు సర్కిల్‌ను ట్రాఫిక్‌కు అనుగుణంగా కుదించాలని, సంపత్ వినాయక రోడ్డులో ట్రాఫిక్ వివరాలు తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తెలుగుతల్లి సబ్‌వేలో కూడా ట్రాఫిక్ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, మద్దిలపాలెం కూడలి వద్ద ట్రాఫిక్ అనుగుణంగా ఐల్యాండ్‌ను కుదించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పరిశీలించి.. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్‌ను ఆదేశించారు. జీవీఎంసీ పట్టణ ప్రణాళికా అధికారి సునీత, పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, ట్రాఫిక్ ఏసీపీ జాన్ మనోహర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు షణ్ముఖరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో పెయింటర్ మృతి



గ్రంధి పాపయ్య మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: అపార్ట్‌మెంట్‌లో పుట్టీ పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందాడు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెం కేఆర్ఎం కాలనీకి చెందిన గ్రంధి పాపయ్య (45) పెయింటర్. మంగళవారం శ్రీనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో పుట్టీ పనులు చేసేందుకు వెళ్లాడు. పుట్టీ పెయింట్ మిశ్రమాన్ని కలుపుతున్న మిషన్‌కు విద్యుత్ సప్లయ్ కోసం వైరును అపార్ట్‌మెంట్‌లోని మూడో ఫ్లోర్ నుంచి నాల్గవ ఫ్లోర్‌కు లాగాడు. ఈ క్రమంలో ఆ వైరుకు ఉన్న జాయింట్‌ను పాపయ్య పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు పాపయ్యను గాజువాకలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అపోలోలో వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రి వైద్యులు ఓ వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కార్డియాలజీ విభాగ వైద్య నిపుణులు డాక్టర్ ప్రాణిగ్రహి, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జయదీప్ ఆస్పత్రిలో మంగళవారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన 78 ఏళ్ల భానూజీరావుకు 2015లో వేరే ఆస్పత్రి లో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. అప్పట్లో ఆయనకు గుండెలో ఎడమ కవాటం మూసుకుపోవడంతో దాన్ని మార్పిడి చేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ ఎడమ కవాటం మూసుకుపోయింది. దీంతో అతని కుటుంబ సభ్యులు ఇటీవల అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు.. ఆయన వయసు ఎక్కువ కావడంతో రెండోసారి అతనికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం ప్రమాదకరమని నిర్ణయానికొచ్చారు. ఈ విషయాన్ని రోగి బంధువులకు వివరించి.. ట్రాన్స్‌కాథెటర్ మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియ ద్వారా చికిత్స చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కుడి కాలు తొడకు రంధ్రం చేసి.. దాని ద్వారా గుండె కుడి కవాటం నుంచి ఎడమ కవాటానికి రంధ్రం చేసినట్లు వైద్యులు వెల్లడించారు. అనంతరం అక్కడ 27.5 మిల్లీమీటర్ల మందం కలిగిన కవాటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ఇది అరుదైన శస్త్ర చికిత్స అని.. ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న వృద్ధుడికి ఈ విధానం ద్వారా శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన గుండె బాగా పని చేస్తోందన్నారు.

కూలిన భారీ వృక్షం



కూలిన చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార: దొండపర్తిలోని నూకాలమ్మ గుడికి ఆనుకుని ఉన్న భారీ మర్రిచెట్టు సోమవారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో వాహనచోదకులు, ప్రజలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెట్టు పక్కన ఉన్న బడ్డీలు దెబ్బతిన్నాయి. ఈ చెట్టు వందేళ్ల నాటిదని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం జీవీఎంసీ సిబ్బంది చెట్టు తొలగించే పనులు చేపట్టారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చెట్టు వెనుక భాగంలో ప్రతి మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తుంటారు. గత కొద్ది రోజులుగా చుట్టు పక్కల భవనాలు నిర్మిస్తూ చెట్టు వేర్లను నరికివేయడంతో కింది భాగానికి బలం తగ్గిపోవడం.. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చెట్టు కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

భారతీయ కళలు విశిష్టమైనవి



శావణిని సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: భారతీయ కళలు విశిష్టమైనవని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించిన ప్రవాస భారతీయురాలు చెల్లపల్లి శ్రావణి శాస్త్రీయ నృత్య ప్రదర్శన.. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి చిన్నారుల్లో ఆసక్తులను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వ్యక్తి సమగ్ర అభివృద్ధికి, వికాసానికి కళలు దోహదపడతాయన్నారు. ఆసక్తితో పాటు కఠోర శ్రమ, ఏకాగ్రత కలిగి ఉంటేనే శాస్త్రీయ నృత్య కళలను అభ్యసించడం సాధ్యపడుతుందన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ భారతీయ కళల ప్రాభవాన్ని, ప్రత్యేకతను చాటే విధంగా శ్రావణి నృత్య ప్రదర్శన జరిగిందన్నారు. భారతీయ సంస్కృతికి వారసులుగా యువతరం నిలవాలని సూచించారు. కార్యక్రమంలో సంగీత విభాగాధిపతి ఆచార్య అనురాధ, ఆచార్య సరస్వతి విద్యార్థి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నృత్యకారిణి శ్రావణిని వర్సిటీ తరఫున సత్కరించారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం రేపు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

పురందేశ్వరి పర్యటన 28కి వాయిదా

ఎంవీపీకాలనీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి విశాఖ పర్యటన ఈ నెల 28కి వాయిదా పడినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు వెల్లడించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తొలుత 27న పురందేశ్వరి విశాఖ రానున్నట్లు వెల్లడించినా ఢిల్లీ టూర్ కారణంగా ఆ కార్యక్రమం 28కి వాయిదా పడిందన్నారు. ఆమె పర్యటన సందర్భంగా విశాఖ విమానాశ్రయం నుంచి లాసన్సబే కాలనీలోని పార్టీ కార్యాలయం వరకు కార్లు, బైక్‌ల ర్యాలీ ఉంటుందన్నారు. ట్రాఫిక్ సర్దుబాట్లలో భాగంగా సిరిపురం నుంచి వీఐపీ రోడ్డుకు వెళ్లే సర్కిల్‌లో రహదారిని మూసివేయడం దారుణమన్నారు. దత్ ఐలాండ్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాల కోసం జీవీఎంసీ చేపడుతున్న పనులను సైతం విమర్శించారు. బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ 28వ తేదీన వుడా చిల్డ్రన్ ఏరీనాలో జరిగే ఉత్తరాంధ్ర జోనల్ సమావేశంలో పార్టీ అభివృద్ధిపై పురందేశ్వరి దిశానిర్దేశం చేస్తారన్నారు.

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
రికవరీ ఆఫీసర్ కార్యాలయం: 31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020. ఇ-మెయిల్ ఐడి: ro2.drtvpatnam@gmail.com. ఫోన్: 0891-2957045

ప్రొక్లమేషన్ ఆఫ్ సేల్ - కమ్ - ఇ-వేలం అమ్మకపు నోటీసు
(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)
RP/314/2019 in OA/177/2019

(1) కెనరా బ్యాంక్ (ఇ-సిండికేట్ బ్యాంక్) డాబాగార్డెన్స్ బ్రాంచ్, విశాఖపట్నం వర్సెస్ M/s ఆరెంజ్ హోమ్ డెకార్స్ అండ్ ఫర్నీచర్ మరియు ఇతరుల మధ్యనున్న ఒ.ఎ. నెం.177/2019 నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థల బకాయిల వసూలు చట్టం 1993 యొక్క సెక్షన్ 19(22) పరిధిలోని గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం వారిచే రికవరీ సర్టిఫికెట్ 25.02.2020 తేదిన జారీచేయబడినది & దానిని అమలు పరచు నిమిత్తం క్రింది సంతకందారునికి పంపబడినది.

(2) రికవరీ సర్టిఫికెట్‌లో సూచించిన రూ.3,22,17,364/- (అక్షరాల మూడు కోట్ల ఇరవై రెండు లక్షల పదిహేడు వేల మూడు వందల అరవై నాలుగు రూపాయలు) తో వడ్డీ, ఖర్చులు వగైరా ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ నుండి వసూలు చేయుటకు ఆర్.పి. నెం.314/2019 నందలి తీర్మానములు అమలు పరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.

(CD-1) M/s. ఆరెంజ్ హోమ్ డెకార్స్ అండ్ ఫర్నీచర్, మేనేజింగ్ పార్టనర్ శ్రీ పిన్నంరాజు బుచ్చి వెంకట సత్యచంద్ర శ్రీనివాసరాజు మరియు పార్టనర్: శ్రీమతి పిన్నంరాజు జ్యోతి, ఫ్లాట్ నెం. G-3 & G-4, ఎమ్‌కెఎస్ వేద మాన్షన్స్, సిద్ధార్థ రెసిడెన్సీ ఎదురుగా, ద్వారకానగర్, 3వ లేన్, విశాఖపట్నం లేదా ఫ్లాట్ నెం. 311, అక్షయ పెబుల్స్ బి. చిన వాల్తేరు, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, విశాఖపట్నం-530016.

(CD-2) శ్రీ పిన్నంరాజు బుచ్చి వెంకట సత్యచంద్ర శ్రీనివాసరాజు, తండ్రి: లేటు సూర్యనారాయణరాజు, ఫ్లాట్ నెం. 101, సుక్షేత్ర ఫ్రంట్ అపార్ట్‌మెంట్స్, సెనోరా బీచ్ రిసార్ట్స్, సాగర్ నగర్, యండాడ, విశాఖపట్నం-530045.

(CD-3) శ్రీమతి పిన్నంరాజు జ్యోతి, భర్త: లేటు సూర్యనారాయణరాజు, ఫ్లాట్ నెం. 202, సుక్షేత్ర ఫ్రంట్ అపార్ట్‌మెంట్స్, సెనోరా బీచ్ రిసార్ట్స్, సాగర్ నగర్, యండాడ, విశాఖపట్నం-530045.

(CD-4) శ్రీ కలిగట్ల రామ గోవింద్, తండ్రి: వెంకట రమణ, హెచ్.నెం 1-4A, ఎస్.రాయవరం మండలం, ధర్మవరం, అగ్రహారం, విశాఖపట్నం-531055.

(3) తేది 20.01.2023 నాటికి బకాయి రూ. 2,89,31,525.27 (తేది 20.01.2023 వరకు వడ్డీ లెక్కించబడినది) + భవిష్య వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు వగైరాలు పొందుటకు రికవరీ ప్రొసీడింగ్స్ ప్రారంభించడమైనది.

(4) సర్టిఫికెట్ డెటార్స్‌కి చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరచిన వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, సమయం, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరి తేది, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంపు మొత్తం మొదలవి ప్రతి ఐటమ్ / షెడ్యూలు దిగువ సూచించడమైనది.

బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 30.08.2023, సా॥ 4 గం.ల వరకు | వేలం తేది: 01.09.2023

షెడ్యూలు & ఐటమ్ నెం.	ఆస్తి విస్తీర్ణం	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	బిడ్ పెంపుదల	వేలం సమయం*
షెడ్యూల్-బి లోని ఐటమ్ నెం.2	ఎ. 1.44 సెంట్లు వ్యవసాయ భూమి	రూ. 60,00,000/-	రూ. 6,00,000/-	రూ. 50,000/-	ఉ॥11.00 గం.ల నుండి మ॥ 12.00 గం.ల వరకు

* ఇ-వేలం సమయం - ఆటో ఎక్స్‌టెన్షన్ పద్ధతిలో ప్రతి సారి 5 నిమిషములు పొడిగించబడుతుంది అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినచో వేలం 5 నిమిషములు పొడిగించబడుతుంది.

(5) సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. సర్వీస్ ప్రొవైడర్ వివరములు: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సంప్రదించవలసిన వ్యక్తి పేరు: శ్రీ ధరణి కృష్ణ, ఫోన్: 9948182222, ఇ-మెయిల్: andhra@c1india.com

(6) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నువారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ https://www.bankeauctions.com ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.

(7) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొనువారు ఇ.ఎమ్.డి. సొమ్ము ఆర్.టి.జి.ఎస్. / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, మిడ్ కార్పొరేట్ బ్రాంచ్ వారి అకౌంట్ నెం. 209272434, IFSC Code:CNRB0013844 వారికి క్రెడిట్ చేయవలెను మరియు బిడ్ ఫారమ్‌లు పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరితేదీలోగా సమర్పించవలెను మరియు పూర్తిచేసిన బిడ్ ఫారమ్స్‌ను, ఆధార్ కార్డు, పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్, ఫ్లాట్ నెంబరు, అడ్రస్ ప్రూఫ్ మరియు ఇఎమ్‌డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకందారునికి రిజిస్టర్డు పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా 31.08.2023 సాయంత్రం 4 గంటల లోపు అందేటట్లు పంపవలెను. పోస్టల్ ఆలస్యమునకు బాధ్యత వహించబడదు.

(8) వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు వేలం నియమ నిబంధనలు, విచారణలు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, షెడ్యూలు ఆస్తి వివరాలు తెలుసుకొనుటకు శ్రీ దేబదత్తా లెంక, చీఫ్ మేనేజర్ (మొబైల్ నెం.9440905181, 0891-2788833), ఇ-మెయిల్ ఐడి cb13844@canarabank.com వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. బిడ్డర్లు బిడ్ సమర్పించేముందు స్వయంగా ఆస్తి ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్లు మరియు ఆస్తి టైటిల్ గురించి పరీక్షించుకొని తృప్తి చెంది వేలంలో పాల్గొనవలెను. దిగువ సంతకందారు ధృవీకరించిన విజయవంతమైన బిడ్డరుకు ఆస్తి మరియు సంబంధిత టైటిల్ డీడ్ డాక్యుమెంట్లను బ్రాంచ్ హెడ్ గారు అందచేస్తారు.

షెడ్యూలు ఆస్తి వివరములు

షెడ్యూలు-బి: ఐటమ్ నెం-2: శ్రీ కలిగట్ల రామ గోవింద్ (CD-4) కు చెందినది: విశాఖపట్నం జిల్లా, ఎస్.రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారం గ్రామం, ఖాతా నెం. 7, (i) సర్వే నెం. 119-1 లోని ఎ. 0.15 సెంట్లు, (ii) సర్వే నెం. 119-2A లోని ఎ. 0.74 సెంట్లు, (iii) సర్వే నెం. 119-2D లోని ఎ. 0.55 సెంట్లు కలిపి మొత్తం ఎ. 1.44 సెంట్లు భూమి. హద్దులు: తూర్పు: ఫుల్ ఫీల్డ్, దక్షిణం: ఫుల్ ఫీల్డ్, పడమర: ఫుల్ ఫీల్డ్, ఉత్తరం: ఫుల్ ఫీల్డ్.

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.12-07-2023 న జారీచేయడమైనది)

సం/- వి.ఎస్.ఎస్.ఎ.ఎస్.కె. బంగార్రాజు, రికవరీ ఆఫీసర్-II
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం